




# తొలి సమయం
దిన పత్రిక
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 158 మంగళవారం 10-06-2025 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..


## తుమ్మిడిహెట్టికి మహారాష్ట్ర ఒప్పుకోలే..

# అందుకే కాళేశ్వరం చేపట్టాం

**నాడు కేంద్రం, ఏపీ, మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వాలే ఉన్నా అనుమతివ్వలే**

**ప్రాణహిత -చేవెళ్లలో ఒక లింక్ మాత్రమే మార్చాం.. ఆరు లింకులు యథాతథం**

**బ్యారేజీల నీటి నిల్వ నిర్ణయం అధికారులదే..**

**మంత్రివర్గ ఉపసంఘం సిఫారసులతోనే ప్రాజెక్టుల రీ ఇంజనీరింగ్**

**నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్ సమయంలోనూ నిర్మాణ స్థలాలు మార్చారు**

**కాళేశ్వరం కమిషన్ విచారణలో మాజీ మంత్రి హరీశ్‌రావు**

**హైదరాబాద్, జూన్ 9:** ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో ప్రతిపాదించిన తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర అంగీకరించకపోవడం వల్లే కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని చేపట్టామని మాజీ మంత్రి హరీశ్‌రావు చెప్పారు. ఆ ప్రాజెక్టును ఏడు లింకులుగా ప్రతిపాదించగా.. ఆరు లింకులను కాళేశ్వరంలో యథాతథంగా ఉంచామని, ఒకదాన్ని మాత్రమే మార్చామని తెలిపారు. సోమవారం ఆయన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారు. కమిషన్ అడిగిన ప్రశ్నలకు జవాబులు ఇవ్వడంతో పాటు ఆధారాలను సమర్పించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక అంతర్రాష్ట్ర సమస్యలు, కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ)లో చిక్కుముళ్లు, నిర్మాణ సమస్యల తర్వాతే ప్రాజెక్టుల రీ ఇంజనీరింగ్ జరిపామని తెలిపారు. ఇందుకోసం తాను చైర్మన్‌గా, నాటి మంత్రులు ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వరరావు సభ్యులుగా మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మంత్రివర్గ ఉపసంఘం సిఫారసులతోనే ప్రాణహిత-చేవెళ్లను రీ ఇంజనీరింగ్ చేశామన్నారు. ప్రాణహిత -చేవెళ్లను రెండు ప్రాజెక్టులుగా విడగొట్టామని, తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కట్టి, ఉమ్మడి ఆదిలాబాద్‌లో నీరందించడానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహితగా, మరొకటి కాళేశ్వరం ఎత్తిపోతల పథకంగా చేపట్టామని తెలిపారు. ప్రాణహిత-చేవెళ్లలో ఏడు లింక్‌లు ఉండగా.. అందులో ఒక్క లింక్ తప్ప మిగిలిన లింకులన్నీ యథాథతంగా చేపట్టామన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని సీడబ్ల్యూసీ చెప్పడంతోనే మేడిగడ్డకు బ్యారేజీ స్థలాన్ని మార్చామని చెప్పారు. 152 అడుగుల ఎత్తుతో తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కట్టడానికి మహారాష్ట్ర అంగీకరించలేదని హరీశ్‌రావు తెలిపారు. ముంపునకు గురయ్యే ప్రాంతానికి పరిహారం చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామంటూ అప్పటి మహారాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి హసన్ ముష్రీఫను 2014 ఆగస్టు 23న కలిశానని తెలిపారు. 152 అడుగుల ఎత్తుతో బ్యారేజీని అంగీకరించబోమని మహారాష్ట్ర నాటి సీఎం పృథ్వీరాజ్ చవాన్ ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డికి లేఖ కూడా రాశారన్నారు. 2007 నుంచి 2014 దాకా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీయే అధికారంలో ఉన్నా.. అనుమతులు ఇవ్వలేదని గుర్తుచేశారు. ఆ తర్వాత మహారాష్ట్రలో బీజేపీ అధికారంలోకి వచ్చాక.. దేవేంద్ర ఫడణవీసతో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ చర్చలు జరిపారని చెప్పారు. 'నేనే



ప్రాణహిత-చే వెళ్ల ముంపునకు వ్యతిరేకంగా ఉద్యమించా. అలాంటి నేనే అనుమతులు ఎలా ఇస్తా?' అని ఫడణవీస్ పేర్కొన్నారని తెలిపారు. ఇక తుమ్మిడిహెట్టి వద్ద 165 టీఎంసీల నీటి లభ్యత ఉండగా.. అందులో 63 టీఎంసీలు ఎగువ రాష్ట్రాల వాటా అని సీడబ్ల్యూసీ 2015 మార్చి 4న లేఖ రాసిందన్నారు. మహారాష్ట్ర అభ్యంతరాలు, నీటి లభ్యతపై సీడబ్ల్యూసీ లేఖతో రీ ఇంజనీరింగ్ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

## సామాజిక బాధ్యతగా

# ఎలక్ట్రిక్ బస్సులు

**ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క**



**సూర్యాపేట అర్బన, జూన 9:**
సామాన్యుల రవాణా అవసరాలు తీరుస్తూనే పర్యావరణ పరిరక్షణలో భాగ ంగా సామాజిక బాధ్యతగా ఆర్టీసీలోకి పెద్దసంఖ్యలో ఎలక్ట్రిక్ బస్సులను తీసుకువస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో 45 ఎలక్ట్రిక్ బస్సులను శాసనమండలి చైర్మన గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సోమవా రం ప్రారంభించి మాట్లాడారు. సూర్యాపేట డిపోకు 79 ఎలక్ట్రిక్ బస్సులను మంజూరు చేయగా వాటిలో 7 డీలక్స్, 72 ఎక్స్‌ప్రెసలు ఉన్నాయని, ప్రస్తుతం 45 ఎక్స్‌ప్రెస్ బస్సులను ప్రారంభించామన్నారు. గత పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక్క బస్సు కూడా కొనుగోలు చేయలేదని, ఒక్క ఉద్యోగ నియామకం చేపట్టలేని పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం వేలాది బస్సుల కొనుగోలు, వేలాది ఉద్యోగ నియామకాలు చేపట్టామన్నారు. ఆడపడుచులందరినీ మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడి వరకైనా ఉచితంగా తీసుకెళ్తున్నామన్నారు. దీని ద్వారా ప్రతిరోజూ రూ.6.88 కోట్లు ఆడపడుచులు ఆదా చేస్తున్నారని, ఆ డబ్బులను ప్రభుత్వం నేరుగా ఆర్టీసీకి జమచేస్తుందన్నారు. దీంతో ఆర్టీసీ లాభాల బాటలో నడుస్తుందన్నారు. ఇప్పటివరకు 182 కోట్ల మంది మహిళలు జీరో టికెట్‌పై ప్రయాణించారని, ప్రభుత్వం ఆర్టీసీకి సుమారు రూ.6200 కోట్లు చెల్లించిందన్నారు. ఆర్టీసీ అభివృద్ధి అక్కాచెల్లెల ఆశీర్వాదం, ప్రభుత్వ నిర్ణయం మహాలక్ష్మి పథకంతో సాధ్యమవుతుందన్నారు. మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ఉచిత సేవలు అందించి ఆర్థికంగా ఆడబిడ్డలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉందని శాసన మండలి చైర్మన గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలుష్యం నుంచి వాతావరణాన్ని కాపాడుకునేందుకు ఎలక్ట్రిక్ బస్సులను అందిస్తున్నాయన్నారు.

# శాఖలపై కసరత్తు

**కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ**

**న్యూఢిల్లీ, జూన్ 9:** తెలంగాణలో కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన మంత్రులకు శాఖల కేటాయింపుపై హస్తినలో కసరత్తు మొదలైంది. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయి దాదాపు గంటసేపు చర్చించారు. మంత్రులకు శాఖల కేటాయింపుపైనే ప్రధానంగా వీరి చర్చ సాగినట్టు తెలిసింది. ప్రస్తుతం మంత్రివర్గంలో ఎవరెవరి దగ్గర ఏయే శాఖలు న్నాయి? రెండు, మూడు మంత్రిత్వ శాఖలు నిర్వహిస్తున్న వారెవరు? కొత్తగా మంత్రివర్గంలో చేరిన వాకిటి శ్రీహరి, గడ్డం వివేక్, అడ్లూరి లక్ష్మణ్‌కు ఏశాఖలు కేటాయించాలి? అనే అంశాలపై సుధీర్ఘంగా చర్చించినట్టు సమాచారం. దీనికి సంబంధించిన జాబితాను కేసీ వేణుగోపాల్‌కు సీఎం రేవంత్ అందించినట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ప్రస్తుతం ఎవరికీ కేటాయించని శాఖలను కొత్తవారికి కేటా యించే అంశంపై సమాలోచన జరిగినట్టు తెలుస్తోంది. అయితే, ప్రస్తుతం ఎవరికీ కేటాయించని శాఖలన్నీ ముఖ్యమంత్రి వద్దే ఉన్నాయి. అందులో ప్రధానమైనవి.. విద్య, పురపాలకం, హోం, గనులు, ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ సంక్షేమం, వాణిజ్య పన్నులు, పశుసంవర్ధక శాఖ, న్యాయ, కార్మిక, క్రీడలు యువజన శాఖ. వీటిలో విద్యా శాఖను తనకు కేటాయించాలని గడ్డం వివేక్ కోరుతున్నట్టు తెలిసింది. ఇదే విషయాన్ని మల్లికార్జున ఖర్గేకు సైతం తెలియజేసినట్టు సమాచారం. అయితే, వివేక్‌కు కార్మిక, మైనింగ్, క్రీడల శాఖ.. అడ్లూరి లక్ష్మణ్‌కు ఎస్సీ, ఎస్టీ సంక్షేమం, వాకిటి శ్రీహరికి పశుసంవర్ధక, యువజన, న్యాయ లేదా మత్స్య శాఖ కేటాయించే అవకాశం ఉన్నట్టు జోరుగా ప్రచారం జరుగుతోంది.

# ఇండియా ఫస్ట్

**మా ప్రతి విధానం వెనుకా ఇదే నినాదం**

**సమష్టి విజయాలకు గర్విస్తున్నాం: మోదీ**

**న్యూఢిల్లీ, జూన్ 9:** తన ప్రభుత్వ ఆధ్వర్యంలో గత 11 ఏళ్లలో భారత్ అతి వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా అవతరించడమే గాక.. వాతావరణ మార్పులు, డిజిటల్ ఇన్నోవేషన్‌లో అంతర్జాతీయంగా కీలక గొంతుకగా మారిందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. తమ ప్రతి విధానం, నిర్ణయం వెనుక 'ఇండియా ఫస్ట్' చోదక శక్తిగా ఉందన్నారు. 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్..' ఎన్‌డీఏ ప్రభుత్వ మార్గదర్శక సూత్రంగా పేర్కొన్నారు. దీనిద్వారా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. ప్రధాని పగ్గాలు చేపట్టి 11 ఏళ్లు.. మూడోసారి బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన సోమవారం 'ఎక్స్' వేదికగా స్పందించారు. '11 ఏళ్ల సేవలో' అనే హ్యాష్‌టాగ్ జోడించారు. ఈ 11 ఏళ్లలో సత్పరిపాలన, పరివర్తనపై దృష్టి కేంద్రీకరించామన్నారు. 140 కోట్ల మంది సమష్టి భాగస్వామ్యం, ఆశీర్వాదంతో వివిధ రంగాల్లో శీఘ్ర అభివృద్ధి, ఎంతో పరివర్తన చోటుచేసుకున్నాయని తెలిపారు. బడుగు వర్గాలకు ప్రభుత్వంలో సరైన ప్రాతినిధ్యం లేదని, వారి ప్రయోజనాలకు విరుద్ధంగా తన ప్రభుత్వం పనిచేస్తున్నట్లుగా ప్రతిపక్షాలు చిత్రించే ప్రయత్నం చేస్తున్నాయని.. కానీ తన మంత్రివర్గంలో 60 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు చోటు కల్పించామన్నారు. సామాజిక న్యాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ఈ వర్గాలకు గతంలో ఎప్పుడూ ఇంత ప్రాతినిధ్యం లేదన్నారు. ఆర్థికాభివృద్ధి నుంచి సామాజిక సాధికారత వరకు ప్రభుత్వ కృషి మొత్తం ప్రజలే కేంద్రకంగా, సర్వతోముఖాభివృద్ధి



దిశగా సాగుతోందన్నారు. ఈ సమష్టి విజయానికి గర్విస్తున్నామని.. ఇదే సమయంలో వికసిత్ భారత్ నిర్మాణానికి మొక్కవోని సంకల్పం తీసుకున్నామని తెలిపారు. వివిధ రంగాల్లో తెచ్చిన మార్పులను వివరించే సమాచారంతో కొన్ని లింకులను ఆయన పోస్టుచేశారు. 'పురోగామి రాజకీయాలను తీసుకొచ్చాం. వికాసవాదాన్ని ప్రధాన స్రవంతిలోకి తెచ్చాం. దేశవ్యాప్తంగా 81 కోట్ల మందికి ఉచితంగా ఆహార ధాన్యాలు అందిస్తున్నాం. 15 కోట్ల ఇళ్లకు కొళాయి కనెకన్లు ఇచ్చాం. 4 కోట్ల మందికిపైగా పేదలకు ఇళ్లు కట్టించి ఇచ్చాం. 12 కోట్ల మరుగుదొడ్లు నిర్మించాం. 68 లక్షల మంది వీధి వ్యాపారులకు రుణాలు అందించాం. కొవిడ్ సమయంలో వివిధ పథకాల కింద 20 కోట్ల మంది మహిళలకు నగదు సాయం అందించాం' అని వివరించారు.

## రాతపూర్వక

# ఆదేశాలిచ్చానా...

## ఫోన్ ట్యాపింగ్‌కు ఆదేశాలిచ్చినట్లు ఉంటే చూపించాలి

- ఫోన్ ట్యాపింగ్‌కు ఆదేశాలిచ్చినట్లు ఉంటే చూపించాలి
- నా కింద పనిచేసిన సిబ్బంది.. అరెస్టు సమయంలో ఇచ్చిన వాంగ్మూలాలు చెల్లుబాటు కావు
- ఎవరి ఫోన్లనూ అక్రమంగా ట్యాపింగ్ చేయించలేదు
- ప్రణీత్‌రావు చేసిన పనితో నాకేం సంబంధం?
- అక్కడేం జరిగిందో ఉన్నతాధికారులందరికీ తెలుసు
- సిట్‌తో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు వ్యాఖ్యలు




**హైదరాబాద్, జూన్ 9:** తడబాటు లేదు.. భయం, ఆందోళన అసలే లేవు. ప్రశ్నలకు.. ఎదురు ప్రశ్నలే సమాధానాలు. విచారణ తీరునంతా ముందే ఊహించినట్లు ఎదురుదాడి ధోరణి. మరీ లోతుగా ప్రశ్నిస్తే.. సమాధానాల దాటవేత. ఇదీ.. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు సిట్ అధికారుల ఎదుట వ్యవహరించిన తీరు. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో పలు మలుపుల తర్వాత ఎట్టకేలకు సోమవారం సిట్ అధికారుల ముందు విచారణకు ప్రభాకర్‌రావు హాజరయ్యారు. తాను ఎవరి ఫోన్లనూ అక్రమంగా ట్యాపింగ్ చేయించలేదని తెలిపారు. ఇందుకు సంబంధించి తాను రాతపూర్వకంగా ఇచ్చిన ఆదేశాలేవైనా ఉంటే చూపించాలన్నారు. తన కింద పనిచేసిన సిబ్బంది.. అరెస్టు సమయంలో ఇచ్చిన వాంగ్మూలాలు చెల్లుబాటు కావన్నారు. తనపై ఇంకా ఉన్నతాధికారులు ఉన్నారని, ఆనాడు ఏం జరిగిందో వారందరికీ తెలుసనని పేర్కొన్నారు. మొత్తంగా సిట్ విచారణ జరిగే తీరుపై పూర్తి అవగాహనతో వచ్చిన ప్రభాకర్‌రావు.. పోలీసుల ప్రశ్నలను తిప్పికొట్టినట్లు తెలిసింది. సోమవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ పోలీసస్టేషన్‌కు వచ్చిన ప్రభాకర్‌రావును పీఎసలోని రెండో అంతస్తులో ఉన్న సిట్ కార్యాలయంలో డీసీపీ విజయకుమార్, ఏసీపీ వెంకటగిరి ఆధ్వర్యంలోని బృందం ప్రశ్నించింది. విచారణ మొత్తాన్ని వీడియో రికార్డు చేశారు. సుదీర్ఘకాలం పోలీసుశాఖలో పనిచేసి ఐజీ స్థాయిలో పదవీ విరమణ పొందిన ప్రభాకర్‌రావు.. ఆపై ఓఎసడీ హోదాలో ఎస్ఐబీలో కొనసాగిన విషయం తెలిసిందే. దీంతో ఆ స్థాయి నేపథ్యం ఉన్న మాజీ పోలీసు అధికారిని విచారించాలంటే అందుకు తగ్గట్లే ప్రశ్నలు ఉండాలని ఉన్నతాధికారులు భావించారు. ఈ మేరకు కేసుపై ఇటీవలే సమీక్ష నిర్వహించి పలు కీలక అంశాల ఆధారంగా ప్రభాకర్‌రావును ప్రశ్నించాలని సిట్ బృందానికి సూచించారు. మరోవైపు ప్రభాకర్‌రావు సైతం పరారీలో ఉన్న పదిహేను నెలల కాలంలో.. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన వారు ఇచ్చిన వాంగ్మూలాలను తెప్పించుకుని అధ్యయనం చేసినట్లు సమాచారం.

# హనుమకొండ గోకుల్ నగర్ జంక్షన్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



**తొలి సమయం వరంగల్ జూన్ 9**

ప్రజల భద్రత, నగర అభివృద్ధి, సమర్థవంతమైన మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా పనిచేస్తున్నాం వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు చేపట్టటం హనుమకొండ పట్టణంలోని అత్యంత రద్దీగా ఉండే గోకుల్ నగర్ జంక్షన్ అభివృద్ధిపై మరియు అక్కడి మౌలిక సదుపాయాల నిర్వహణపై వరంగల్ పశ్చిమ నియోజకవర్గ గౌరవ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి,నగర కమిషనర్ అశ్విని తనాజీ వాకడే కలిసి ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు జంక్షన్ ప్రాంతాన్ని, అక్కడి నుంచి రాజాజీ నగర్ వరకు వున్న ప్రధాన రహదారి ఇరువైపులా ప్రవహిస్తున్న డబుల్ డ్రైనేజీలను, వర్షపు కాలంలో నీరు నిలువకుండా చూసే దిశగా సైడ్ డ్రైనేజీల పనితీరు తదితర అంశాలను సమీక్షించారు. ప్రజలు తరచూ వాహనదారులు, పాదచారులు అధికంగా ఉపయోగించే ఈ ప్రాంతాన్ని మరింత అందంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని జలమార్గాల్లో ఎక్కడైనా ఆటంకాలు, మురికి నిలిచే ప్రాంతాలు, పొలమైన డబుల్ డ్రైన్లు ఉంటే వెంటనే గుర్తించి మరమ్మత్తులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా రోడ్డు దారి మధ్య భాగంలో లేదా ఇరుకైన మలుపుల వద్ద వాహనాలకు అంతరాయం కలిగించే అంశాలను గుర్తించి వాటిని తొలగించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జంక్షన్ అభివృద్ధిలో భాగంగా తగిన విద్యుద్దీపాలు, ఫుట్‌పాత్‌లు, సిగ్నల్ వ్యవస్థలు, చెట్లతో మార్గ సుందరీకరణ, అవసరమైతే వాహనాల రవాణా దిశలు పునఃపరిశీలన వంటి అంశాలపై ప్రణాళిక రూపొందించాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఉన్నతాధికారులు, కార్పొరేటర్లు మరియు ప్రజా ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ పార్టీని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తాం

**పార్టీకి సేవ చేసిన వారికి గుర్తింపు, పదవులు పార్టీ పట్ల నిర్లక్ష్యం వహిస్తే పక్కకు తప్పించడమే గమ్యం**

**డీసీసీపి,ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**




**తొలి సమయం వరంగల్ జూన్ 9**

హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీని పునరుద్ధరించేందుకు పూర్తి స్థాయి ప్రక్షాళన అవసరమని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మరియు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం రోజున హనుమకొండలోని కాంగ్రెస్ భవన్ లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పార్టీ సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ," రానున్న రోజుల్లో పార్టీ కోసం నిజంగా కష్టపడిన వారికే బాధ్యతలు, పదవులు లభిస్తాయి. నిజాయితీగా పనిచేసే కార్యకర్తలను గుర్తించి వారిని ప్రోత్సహించడమే నా ప్రధాన లక్ష్యం. వారికోసం భారీగా బహుమతులు కూడా ప్రకటిస్తాను," అని అన్నారు .పార్టీలో క్రమశిక్షణను పాటించడమే ముఖ్యమని స్పష్టం చేసిన ఆయన, వ్యతిరేక స్వరాలు వినిపిస్తే ఏమాత్రం సహించేది లేదన్నారు. "ప్రతి కార్యకర్తకి సముచిత స్థానం లభించాల్సిందే. అయితే, పదవుల్లో ఉన్నప్పటికీ కార్యకలాపాల్లో ఆసక్తి చూపని వారిని పక్కకు తప్పించడం తప్పదని" స్పష్టంగా చెప్పారు. తనపై వ్యక్తిగతంగా నష్టం చేసిన వారిని పరిగణనలోకి తీసుకోనన్న ఆయన, పార్టీకి నష్టం కలిగించే చర్యలను మాత్రం ఏ మాత్రం ఉపేక్షించబోనని హెచ్చరించారు. 10 ఏళ్లలో ఎన్నో కష్ట నష్టాలకు, అక్రమ కేసులకు ఒరుచుకొని నిలబడినామని నాయకులు కాస్త ఓపిక పడితే పదవులు వస్తాయని చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో పీసీసీ సభ్యులు,హనుమకొండ జిల్లా కాంగ్రెస్ నేతలు, అనుబంధ సంఘాల నాయకులు,యువజన నాయకులు, డివిజన్ అధ్యక్షులు బూత్ స్థాయి కార్యకర్తలు ,ప్రజా ప్రతినిధులు,మాజీ ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**కాకతీయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో**

# వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**తొలి సమయం వరంగల్ జూన్ 9**

కాకతీయ విశ్వవిద్యాలయంలో కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి. ఆది వాసి గిరిజన బిడ్డలపై ఆపరేషన్ కగార్ పేరుతో మధ్య భారత ప్రాంతాల్లోని అమాయకపు ఆదివాసీ బిడ్డలను కాల్చి చంపడం దారుణమని ఎమ్మెల్యే నాయిని అన్నారు. యూనివర్సిటీ విద్యార్థులు శాంతి చర్చలు జరపాలని డిమాండ్ సమర్థిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ పక్షాన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూన్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ ఆపరేషన్ పేరుతో నిజాయితీగా జీవిస్తున్న గిరిజన కుటుంబాలు లక్ష్యంగా మారుతున్నాయి. బీజేపీ ప్రభుత్వానికి ఒకే ఒక్క దౌర్భాగ్యం %-% ప్రశ్నించే గొంతులను విభిన్నమైన జీవనశైలిని అణగదొక్కడమే లక్ష్యంగా ఉంది. "కాగర్" అనే పేరు పెట్టుకుని గిరిజనులను లక్ష్యంగా చేసుకోవడం అనేది ప్రభుత్వ అధికార దుర్వినియోగానికి నిదర్శనం. బీజేపీ ప్రభుత్వానికి గిరిజనుల జీవితాలకు విలువ లేదని,వారు అడవిలో ఉన్నారనే కారణం చేత మారణకాండలో అమాయకులను చంపడం దుర్మార్గమైన ఆలోచన అని మండిపడ్డారు. ఒక అభివృద్ధి చెందుతున్న ప్రజాస్వామ్యంలో ఈ విధమైన సంహార రాజకీయాలకు తావు లేదని అన్నారు. గిరిజనులకు గుండెచప్పుడు ఉన్నంతవరకూ,వారికి ఆకాశాన్ని తాకాలన్న,ఆశ,ఉన్నంతవరకూ,వారి మీద తుపాకీ గురిపెట్టే ప్రతి దుష్ట శక్తికి మేము ఎదురు నిలుస్తామని భరోసా ఇచ్చారు. "ఆపరేషన్ కాగర్" తక్షణం నిలిపేయాలి .గిరిజనులపై దాడులు మానేయాలని శాంతియుత చర్చలతో పరిష్కార మార్గాలను అన్వేషించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పక్క దేశాలకు శత్రు దేశాలకు చర్చలకు అనుమతి ఇస్తున్నారు కానీ మన బిడ్డలు చర్చలకు సిద్ధం అన్నకూడా ఆపడం లేదు,కాగర్ పేరు తో కేంద్ర ప్రభుత్వం అమాయకులైన గిరిజనుల ను చంపడం అన్యాయం ఈ విషయం మీద ఎవరైనా స్పందించాలిసిందే మీరు విద్యార్థులు గా స్పందించడం సంతోషం మీరు ఏ ప్రోగ్రాం తీసుకున్న నేను సహకరిస్తున్నాను అని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిపిసీసీ అధికార ప్రతినిధి కుచన రవళి,కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్,యూనివర్సిటీ విద్యార్థి విభాగ నాయకుడు అలువాల కార్తీక్,యువజన కాంగ్రెస్ నాయకుడు తోట పవన్,పౌర హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు రమేష్ చందర్,భరత్ బచావో వెంగళ్ రెడ్డి,విద్యార్థి సంఘాల,నాయకులు,శ్రవణ్,మహేష్ ,క్రాంతి ,భువన్, శివ ,మనోహర్, సనత్, జయసూర్య, మనోహర్,శరత్,జన్ను రాజు,అరూరి రంజీత్,హతి రామ్ తదితరులు పాల్గొన్నారు.

# షీ టీమ్స్, సైబర్ నేరాల పై కరిమాబాద్ ప్రభుత్వ హై స్కూల్ లో అవగాహన సదస్సు




**తొలి సమయం వరంగల్ జూన్ 9**

వరంగల్ కమీషనరేట్ సి పి ఆదేశాల మేరకు షీ టీమ్స్ మహిళా %జ×% సుజాత కరిమాబాద్ గౌట్ హై స్కూల్లో షీ టీమ్స్,డ్రగ్స్,సైబర్ నేరాలపైన షీ టీమ్స్,విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది షీ టీమ్స్ మహిళ సుజాత మాట్లాడుతూ షీ టీమ్స్, సైబర్ నేరాలపై,పటిష్టంగా,పనిచేస్తున్నామని తెలిపారు. ప్రతి స్కూల్ కాలేజీలలో చదువుకునే విద్యార్థులు ఇంటర్నెట్ ను సద్వినియోగం చేసుకోవాలి, సైబర్ మోసగాళ్ళ వల్ల మోసాలకు గురి కావద్దు,బ్యాంక్ ఖాతా,%ూవీ% కార్డ్ వివరాలు,%ూ% వివరాలు ఇతరులకు తెలపవద్దు, ఇతరులు ఆశ చూపితే వాటికి ఆకర్షితులు కావొద్దు. మెసేజ్ లలో వచ్చే బ్లూ లింక్ అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దు అని కోరినారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్ కు పిర్యాదు చేయాలని అన్నారు. అలాగే వేధింపుల పై 100కుసమాచారం ఇవ్వాలని తెలిపినారు. ఎవరైనా ఆకతాయిలు ఆడపిల్లలను, మహిళలను వేధింపులకు గురి చేస్తే వరంగల్ షీ టీం ఫోన్ నెంబర్ 8712685142 కి సమాచారం ఇవ్వండి మీయొక్క వివరాలు,గోప్యంగా, ఉంచబడతాయి అని తెలిపారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, ఏటీఎం పిన్ నెంబర్లు, సోషల్ మీడియాలో బహిర్గతం చేయొద్దన్నారు. వ్యక్తిగత ఫోటోలను %ణూ% లుగా పెట్టుకోవద్దని చెప్పారు. మొబైల్ యాప్ లలో వచ్చేటువంటి అనవసరమైన బ్లూ లింకులను క్లిక్ చెయ్యొద్దు అని తెలిపారు. యువత చెడు వ్యసనాల బారిన పడొద్దు అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాన్ని నడపవద్దు ట్రాఫిక్ రూల్స్ ను అతిక్రమించొద్దు అని అన్నారు. యువత లోన్ యాప్ లకు దూరంగా ఉండాలన్నారు. పుట్టిన తేదీలను,ఫోన్ నెంబర్లను పాస్వర్డ్ గా పెట్టుకోవద్దు అని సూచించారు సామాజిక మాధ్యమాలకు రక్షణగా బలమైన పాస్వర్డ్లు పెట్టుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం నందు స్కూల్ హెడ్ మాస్టర్, షీ టీమ్స్ కె. సుజాత,ఉపాధ్యాయునిలు, 200 సభ్యులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంపీ రవిచంద్రను సన్మానించిన ఇనుగుర్తి అంబేద్కర్ యువజన సంఘం ప్రముఖులు



**తొలి సమయం వరంగల్ జూన్ 9**

రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను స్వగ్రామం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి అంబేద్కర్ యువజన సంఘం ప్రముఖులు శాలువాతో సత్కరించారు. ఇనుగుర్తిలో ఈనెల 3వతేదీన రాజ్యాంగ నిర్మాత,భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని నెలకొల్పిన విషయం తెలిసిందే. విగ్రహావిష్కరణ,ఆ తర్వాత జరిగిన సభ విజయవంతమైన నేపథ్యంలో సంఘం అధ్యక్షులు పప్పుల వెంకన్న, గౌరవాధ్యక్షులు గుజ్జునూరి బాబురావు,బేతమల్ల చంద్రయ్య,గుజ్జునూరి వెంకన్న,తమ్మడపల్లి యాదగిరి, కోశాధికారి గోపాన్ దాస్ కృష్ణలు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

## తాళ్ళ పద్మావతి కాలేజీ యాజమాన్యం పులి రంజిత్ రెడ్డి, బండి కుమారస్వామి బెదిరింపులకు కుమారస్వామి ఆత్మహత్య ప్రయత్నం

**మారుపాక అనిల్ కుమార్ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**



**తొలి సమయం వరంగల్ జూన్ 9**

వరంగల్ ఈరోజు వరంగల్ జిల్లా కిలావరంగల్ మండలం ఉరుసు శివారు లో పోలేపాక కుమారస్వామి %ం/శీ% మల్లేశం వయస్సు: 54 కులం ఎస్సి మాదిగ %తీ/శీ% ఉరుసు తనకు వారసత్వంగా వచ్చినటువంటి ఆరు ఎకరాల భూమి లో నుండి కొంత అమ్మగా మరికొంత భూమి గురించి గత 20 సంవత్సరాలుగా పోరాటం సాగిస్తున్నారు ఈ మధ్యకాలంలో బండి కుమారస్వామి పులి రంజిత్ రెడ్డి తాళ్ల మల్లేశం మధు పోలేపాక కుమారస్వామిని బెదిరింపులకు గురి చేయగా మనస్థాపానికి గురై ఈరోజు తాళ్ల పద్మావతి కాలేజీ ఆవరణలో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య ప్రయత్నం చేయడం జరిగింది ఇట్టి విషయం తెలుసుకున్న తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ మరియు సంఘీ ఏలేందర్ వెంటనే వరంగల్ ఎంజీఎం నాకు వెళ్లి 80% కాలిన గాయాలతో గాయపడిన పోలెపాక కుమారస్వామికి వరంగల్ ఎంజీఎం లో సూపర్డెంట్ తో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరడమైనది అలాగే పోలెపాక కుమారస్వామి ఆత్మహత్య ప్రయత్నానికి కారకులైన వారిపై వెంటనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి జైలుకు పంపాలని ఎస్సై శ్రీకాంత్ ని కోరడమైనది పాల్గొన్న దళిత సంఘాల నాయకులు.

## ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలి

**హనుమకొండ జిల్లా కలెక్టరేట్ నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అర్జీలను స్వీకరించిన కలెక్టర్, జిల్లా అధికారులు**



**తొలి సమయం వరంగల్ జూన్ 9**

హనుమకొండ: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు సత్వర పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు అందించిన అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ప్రజలు అందించిన అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు త్వరగా పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, గృహ నిర్మాణ, భూ రికార్డులు సర్వే, విద్యుత్, మున్సిపల్, విద్య, సాగునీటిపారుదల, మెప్మా, వైద్య ఆరోగ్య, కుడా, ఉపాధి కల్పన, తదితర శాఖలకు సంబంధించి 137 అర్జీలను ప్రజలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ స్టేట్ క్యాబినెట్ మినిస్టర్ గా వాకిటి శ్రీహరి ప్రమాణ స్వీకారం అనంతరం కొండా సురేఖ తో మర్యాదపూర్వకంగా కలిశారు



**తొలి సమయం వరంగల్ జూన్ 9**

తెలంగాణ స్టేట్ క్యాబినెట్ మినిస్టరుగా ఇటీవల ప్రమాణస్వీకారం చేసిన వాకిటి శ్రీహరి సోమవారం తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా వాకిటి శ్రీహరికి, మంత్రి సురేఖ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

## అదుపుతప్పి కార్ బోల్తా - ఒకరికి గాయాలు ,

**తొలి సమయం దంతాలపెల్లి టౌన్ జూన్ 9:**



దంతాలపల్లి లో శివారు ఖమ్మం -వరంగల్ జాతీయ రహదారిపై, కారు అదుపుతప్పి బోల్తా పడ్డ ప్రమాదం చోటుచేసుకున్నది ఖమ్మం నుంచి వరంగల్ వెళ్లే లారీని తప్పించబోయిన కారు డ్రైవర్ ఒకసారి బ్రేక్ వేయడంతో, కారు కంట్రోల్ తప్పింది, ఫల్టీ కొట్టింది ఇట్టి ప్రమాదంలో స్వల్పమైన గాయాలు డ్రైవర్ కు తగిలినవిఈ కార్యక్రమంలో, ఇల్లందు పట్టణ,మండల రైతులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు మహిళా విభాగం, యూత్ విభాగం, కార్యకర్తలు పాల్గొన్నారు

## గిరిజనుల హక్కుల కోసం ఉద్యమించిన పోరాట యోధుడు బిర్సముండా. బిర్స ముండా 125వ వర్ధంతి - సిపిఎం



**తొలిసమయం, ఇల్లందు.జూన్, 09.**

గిరిజనుల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసి, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా గిరిజనులను చైతన్య పరుస్తూ, వారి హక్కుల కోసం తుది శ్వాస వరకు ఉద్యమించిన గిరిజన పోరాట యోధుడు భగవాన్ బిర్స ముండా అని వారి ఆశయాలని ముందుకు తీసుకెళ్లే భాధ్యత ప్రతి ఒక్కరి పై ఉన్నదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అబ్దుల్ నబి, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్, ఆదివాసీ నాయకులు వజ్జా సురేష్ లు అన్నారు. బిర్స ముండా 125 వ వర్ధంతిని సిపిఎం ఇల్లందు మండల కమిటీ ఆధ్వర్యంలో ఏలూరి భవన్ నందు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటిష్ వారి పై గిరిజనులపై విధిస్తున్న అక్రమ పన్నుల కు వ్యతిరేకంగా గిరిజనులను చైతన్య పరుస్తూ, ఐక్య పరుస్తూ స్వాతంత్ర కోసం పోరాడిన యోధుడని అన్నారు. నేడు కేంద్రం లో ఉన్న బీజేపీ ప్రభుత్వం గిరిజనులను గిరిజనుల పోరాట యోధులను కీర్తిస్తూనే ఆ గిరిజనులను నిలువునా మోసం చేస్తుందని అన్నారు. ఖనిజలు, గనులు పేరిట కార్పొరేట్ కంపెనీ లకు సహజ వనరులను దోచి పెడుతుందని, అడవులపైన ఆ కంపెనీలకు అధికారం కల్పిస్తూ గిరిజన చట్టాలను తుంగలో తొక్కుతుందని అన్నారు. ఆపరేషన్ కగర్ ముఖ్య ఉద్దేశం కూడా అడవులను కార్పొరేట్ లకు దోచి పెట్టడమే అని అన్నారు. బిర్స ముండా స్ఫూర్తి తో కేంద్ర ప్రభుత్వ గిరిజన అణచి వేత విధానాలకి వ్యతిరేకంగా ఉద్యమించాలని వారి ఆశయ సాధనకు కృషి చేయాలనీ పిలుపునిచ్చారు. ఈ వర్ధంతి కార్యక్రమం లో సిపిఎం నాయకులు తాళ్లూరి కృష్ణ, మన్నెం మోహన్ రావు, పద్మ, యాకుబ్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత జిల్లా విద్యాశాఖాధికారి రాము

**జగిత్యాల టౌన్,జూన్ 9,**

ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత కొరకు ఉపాధ్యాయులకు, పారిశుద్ధ్య కార్మికులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో సోమవారం రోజున జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఉపాధ్యాయ శిక్షణ కేంద్రంలో అన్ని మండలాల నుంచి ఒక్కొక్క ఉపాధ్యాయులు ఇద్దరు పారిశుద్ధ్య కార్మికులకు పాఠశాలల్లో చేపట్టవలసిన పారిశుద్ధ్య కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖాధికారి రాము మాట్లాడుతూ పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, పచ్చదనంతో కళకళలాడే విధంగా తీర్చిదిద్దాలని అన్నారు. తరగతి గదులతో పాటు మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని కోరారు

# కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

- రాష్ట్ర పంచాయతీ రాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి వర్యులు దనసరి అనసూయ (సీతక్క)
- పెట్రోల్ పంప్ ఏర్పాటు అనువైన స్థలాలను వెంటనే ఎంపిక చేయాలి
- సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు అనువైన భూములను 10 రోజుల్లో గుర్తించాలి
- బడి బాట, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన మంత్రి సీతక్క



**తొలి సమయం వరంగల్ జూన్ 9**

తెలంగాణ రాష్ట్రంలో కోటి మంది మహిళా సంఘాల మహిళలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంతో పలు కార్యక్రమాలు చేపడుతున్నామని రాష్ట్ర పంచాయతీ రాజ్ %d% గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి వర్యులు దనసరి అనసూయ (సీతక్క) అన్నారు.సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పంచాయతీ రాజ్ %d% గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి వర్యులు దనసరి అనసూయ (సీతక్క) , సి.ఎస్ కే.రామ కృష్ణా రావు లతో కలిసి బడి బాట, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాల పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు

**మంత్రి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ,**

కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలని లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అనేక కార్యక్రమాలు చేపట్టామని ఇందులో భాగంగా మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ పంప్ లను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. జిల్లాలలో మహిళా సంఘాలకు పెట్రోల్ పంప్ ఏర్పాటుకు అనువైన స్థలాలను ఎంపిక చేయాలని, ఒక పెట్రోల్ పంప్ ఏర్పాటు వల్ల 10 కుటుంబాలు బాగు పడతాయని మంత్రి అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాల ద్వారా రైస్ మిల్స్, సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల స్థాపన, ఆర్టీసీ కు అద్దె బస్సులు నడపడం వంటి అనేక కార్యక్రమాల అమలు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.నవంబర్ నాటికి జిల్లాలో చేపట్టిన నూతన ఇందిరా మహిళా శక్తి భవనాలు పూర్తి చేయాలని ఈ మహిళా శక్తి భవనాలకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా గత నవంబర్ మాసంలో శంకుస్థాపన చేసుకున్నామని,చాలా జిల్లాలో వీటి పురోగతి ఆశించిన స్థాయిలో లేదని అన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్ల సమన్వయం చేసుకుంటూ నిర్దేశించుకున్న గడువు లోపు పనులు పూర్తయ్యేలా చూడాలని అన్నారు. మహిళా సంఘాల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు ఏకరూప దుస్తులు కుట్టు పనులు వేగంగా జరిగాయని, దీనికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు. జూన్ 12న పాఠశాలలో పునః ప్రారంభోత్సవం సందర్భంగా పండగ వాతావరణం లో పిల్లలకు ఏకరూప దుస్తులు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల పునః ప్రారంభోత్సవం సందర్భంగా పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రం చేయాలని పిచ్చి మొక్కలను పూర్తిస్థాయిలో తొలగించాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు.గ్రామీణ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో మహిళలకు అవగాహన కల్పిస్తూ నూతన మహిళ సంఘాలను ఏర్పాటు చేయాలని, పేదరికం అధికంగా ఉండే ప్రాంతాలలో అవగాహన కల్పిస్తూ మహిళా గ్రూపుల వల్ల కలిగే బెనిఫిట్స్ పై అవగాహన కల్పించాలని అన్నారు. ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల దగ్గర రుణాల కోసం మహిళలు పోయే దుస్థితి రాకుండా, జిల్లాలో పూర్తి స్థాయిలో నూతన మహిళా సంఘాలను తయారు చేసి మహిళలను గ్రూపు లలో చేర్పించాలని అన్నారు.మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల ఏర్పాటు ప్రక్రియ గాంధీ జయంతి నాటికి పూర్తి చేయాలని అన్నారు.ప్రతి జిల్లాలో మహిళా సంఘాల ద్వారా విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు కోసం సబ్ స్టేషన్ పరిధిలో 8 ఎకరాల అనువైన భూమి 10 రోజుల్లో గుర్తించాలని అన్నారు.సీ.ఎస్ కె.రామ కృష్ణా రావు మాట్లాడుతూ, ప్రస్తుతం రాష్ట్రంలో బడి బాట కార్యక్రమం నడుస్తుందని, ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యా సంవత్సరం ప్రారంభంలో తీసుకోవాల్సిన చర్యలు సంపూర్ణంగా చేపట్టాలని అన్నారు.విద్యార్థుల మీద, ఉపాధ్యాయుల జీతాలు పట్ల, పాఠశాలల మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం భారీ ఎత్తున నిధులు ఖర్చు చేస్తుందని, సంపూర్ణంగా వినియోగం లోకి రావాలని అన్నారు.100 శాతం పిల్లలు బడులలో ఎన్ రొల్మెంట్ కల్గి ఉండాలని అన్నారు.బడికి వచ్చే పిల్లలకు నాణ్యమైన విద్య అందేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని అన్నారు.వేసవి సెలవులలో జిల్లా కలెక్టర్ల సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దాదాపు లక్షా 12 వేల ఉపాధ్యాయులకు 5 రోజుల పాటు నూతన బోధన పద్ధతుల పై శిక్షణ అందించామని అన్నారు. 10వ తరగతి పూర్తిగా సాధించిన విద్యార్థులు తప్పనిసరిగా పై చదువులు చదివేలా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలని సీ.ఎస్ సూచించారు.పాఠశాలలు ప్రారంభించిన మొదటి రోజే పాఠ్య పుస్తకాలు, ఏక రూప దుస్తుల పిల్లలకు పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.బడి బాట కార్యక్రమం ద్వారా ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సదుపాయాలు, ఏ.ఐ టూల్స్ ద్వారా అందిస్తున్న ప్రాథమిక విద్య, డిజిటల్ తరగతులు, పాఠశాలల్లో వచ్చిన మార్పులను వివరిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్స్ పెంచాలని అన్నారు.స్వశక్తి మహిళా సంఘాలతో ప్రత్యేక సమావేశంలో నిర్వహించే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఎన రోల్మెంట్ గురించి చర్చించాలని అన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో 20 లక్షల పైగా విద్యార్థులు చదువుతున్నారని, పిల్లలు ఏం నేర్చుకుంటున్నారు బడులలో అనే అంశం పట్ల మనం మరింత మెరుగు పర్చుకోవాల్సి ఉంటుందని అన్నారు. తొలిమెట్టు కార్యక్రమం మరింత సమర్ధవంతంగా అమలు చేయాలని, దీని పై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహించి రెగ్యులర్ గా తనిఖీలు చేయాలని సీ.ఎస్ ఆదేశించారు.2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను రూపొందించాలని పెట్టుకున్న లక్ష్యం నెరవేరాలంటే మహిళలను భాగస్వామ్యం చేయడం చాలా కీలకమని సీ.ఎస్ పేర్కొన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద వివిధ వాణిజ్య వ్యాపార యూనిట్ల మహిళల చే గ్రౌండింగ్ చేయాల్సి ఉంటుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల ఏకరూప దుస్తులు కుట్టిన మహిళలందరికి కుట్టు కూలీ 75 రూపాయల ప్రభుత్వం విడుదల చేసిందని, ఈ నిధులను సంబంధిత మహిళలకు త్వరగా చేరేలా చూడాలని అన్నారు. 110 కోట్ల రూపాయలతో 22 నూతన జిల్లాలో ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి భవనాలను నిర్మిస్తుందని, వీటిలో ప్రభుత్వం 19 కోట్ల రూపాయల విడుదల చేసిందని, కలెక్టర్ స్థానిక పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో రివ్యూ నిర్వహించి పనులు వేగవంతం చేయాలని, నవంబర్ 19 నాటికి ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణం పూర్తి కావాలని అన్నారు.నారాయణపేట జిల్లాలో మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ పంప్ ఏర్పాటు చేశామని , అదే విధంగా అన్ని జిల్లాలలో పెట్రోల్ పంప్ ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ అనుకూలంగా ఉన్న 6 నుంచి 10 గుంటల భూమి గుర్తించాలని అన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డిఆర్డిఓ మేన శ్రీను, జిల్లా విద్యాశాఖ అధికారులు, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అర్చక సంక్షేమ నిధి పోస్టరును రిలీజ్ చేసిన మంత్రి కొండా సురేఖ, ఎండోమెంటు ఉన్నతాధికారులు

**అర్చక, ఉద్యోగులకు గ్రాట్యుటీ రూ 4 లక్షల నుండి రూ 8 లక్షలకు పెంపు**

**అర్చక, ఉద్యోగ సంక్షేమ నిధి ఏర్పాటు వారి సేవలను గుర్తిస్తూ ప్రభుత్వ కీలక నిర్ణయం**

**తొలి సమయం వరంగల్ జూన్ 9**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దేవాయాలయాల్లో పని చేస్తున్న అర్చకుల చిరకాల కోరికను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీర్చారు. అన్ని ఆలయాల్లో సుదీర్ఘ కాలంగా సేవలు అందిస్తున్న అర్చక, ఉద్యోగ సంక్షేమ నిమిత్తం ప్రత్యేకంగా నిధిని ఏర్పాటు చేశారు. సోమవారం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎండోమెంటు ప్రిన్స్ పల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరెక్టర్ వెంకటరావు తదితర అధికారులతో అర్చక, ఉద్యోగ సంక్షేమ నిధి పోస్టరును రిలీజ్ చేశారు.అనంతరం మంత్రి సురేఖ మాట్లాడుతూ అర్చక, ఉద్యోగుల కోసం తమ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని వివరించారు. ఈ సంక్షేమ ట్రస్టు ద్వారా దేవాదాయ శాఖ పరిధిలో గల సహాయ కమీషనర్ స్థాయి వరకు గల దేవాలయాలలో పని చేసే సుమారు 13,700 మంది అర్చకులు, ఇతర ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుందని ఆమె వ్యాఖ్యానించారు. అర్చకులు, ఇతర ఉద్యోగులకు మరణానంతరము లేదా రిటైర్మెంట్ గ్రాట్యూటి ఇవ్వడం జరుగుతుందన్నారు.ధూపదీప నైవేద్య అర్చకులకు మరణానంతరము చెల్లించు గ్రాట్యూటి నిర్ధారించినట్టు చెప్పారు. మరణానంతరము చెల్లించు ఎక్స్ గ్రేషియా, అంతిమ సంస్కారాల ఖర్చుల నిమిత్తము చెల్లింపు ఈ నిధి ఉపయోగపడు తుందన్నారు. ఈ నిధి కింద ఉద్యోగులకు. మెడికల్ రీయింబర్స్ మెంట్, వివాహ నిమిత్త పథకం, ఉపనయన పథకం, గృహ నిర్మాణ, కొనుగోలు మరియు మరమ్మత్తుల నిమిత్త పథకం, విద్యా పథకం, విధులు నిర్వహిం చలేని వికలాంగులైన ఉద్యోగులకు ఆర్థిక సహాయ పథకం అందజేయడం జరుగుతుందన్నారు.పైన పేర్కొన్న పథకాలలో రెగ్యులర్ అర్చకులు, ఇతర ఉద్యోగులకు మరణానంతరము లేదా రిటైర్మెంట్ గ్రాట్యూటి పథకానికి 28.05.2025 రోజున అర్చక సంక్షేమ బోర్డు వారు గతంలో చెల్లించిన గ్రాట్యుటీ రూ 4 లక్షల నుండి రూ 8 లక్షలకు పెంచినట్టు చెప్పారు. ఇట్టి గ్రాట్యుటీ మొత్తమును సదరు ఉద్యోగి యొక్క బ్యాంకు ఖాతాలో ఏక మొత్తములో వారి సర్వీసు కాలమునకు లోబడి చెల్లిస్తామన్నారు. ఎవరైనా అకాలం చనిపోతే, అంతిమ సంస్కారాల ఖర్చుల నిమిత్తం రూ20,000/- ల నుండి రూ 30,000/- లకు పెంచినట్టు చెప్పారు. కాగా, ఈ అంశానికి సంబంధించి ప్రాంతీయ, జిల్లా స్థాయిలో ఉన్నతాధికారులు అర్చక, ఉద్యోగ సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేస్తారని మంత్రి వివరించారు. ఈ నిర్ణయంతో అర్చకులు, దేవాదాయ శాఖ ఉద్యోగులకు పెద్ద ఎత్తున లబ్ధి జరుగుతుందని మంత్రి కొండా సురేఖ ఆశాభావం వ్యక్తం చేశారు.



TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101

